సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



ఇన్‌చార్జి అధికారులే దిక్కు

జిల్లాలో పూర్తిస్థాయి డీఎస్‌వో లేరు. దీంతో ఇన్‌చార్జి అధికారితో పౌరసరఫరాల శాఖలో పర్యవేక్షణ కొరవడింది.

- 8లో ▸



పోడు పేరుతో గొడ్డలి వేటు

పోడు వ్యవసాయం పేరిట సిరికొండ మండలంలోని అడవులను పలువురు యథేచ్ఛగా నరికివేస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.1 /22.8

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డీసీసీబీలో రూ.169.73 కోట్ల రుణమాఫీ



కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) పరిధిలోని 143 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో గల 40,654 మంది రైతులకు మూడు విడతల్లో రూ.169.73కోట్ల మేర రుణమాఫీ జరిగిందని చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం నిజామాబాద్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ అనంతరం ఉమ్మడి జిల్లాలకు కలిపి సుమారు రూ.75కోట్ల వరకు తిరిగి పంట రుణాలు మంజూరు చేశామన్నారు. బ్యాంకు రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. రుణమాఫీ పొందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ అధికారులు తగిన సూచనలు చేస్తున్నారని పేర్కొన్నారు.

పార్టీల ప్రతినిధులతో కమిషనర్ సమావేశం



నిజామాబాద్ అర్బన్: వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం మున్సిపల్ కమిషనర్ మకరందు తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా, సవరణకు సంబంధించిన బూత్‌లెవల్ ఆఫీసర్లు, ఇంటింటి సర్వే ప్రారంభించిన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయడం, ఓటు బదిలీ, మరణించిన వారి వివరాలు తొలగించడంలో బూత్ లెవల్ ఆఫీసర్లకు సహకరించాలని వారిని కోరారు.

అమ్మ పేరిట 10 వేల మొక్కలు

డొంకేశ్వర్(ఆర్మూర్): వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా అమ్మ పేరు మీద 10వేల మొక్కలు నాటారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'ప్లాంట్ ఫర్ మదర్' థీమ్‌తో గ్రామీణాభివృద్ధి శాఖ గ్రామాల్లో మొక్కలను నాటించింది. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జీపీ సిబ్బంది, ప్రజలు కలిసి వారి అమ్మ పేరుతో మొక్కలు నాటి ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రజలు కూడా అమ్మ పేరుతో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

గల్లంతైన బాలిక మృతదేహం లభ్యం



నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ నగరంలోని ఆనంద్‌నగర్ కాలనీలో బుధ వారం సాయంత్రం డ్రెయినేజీలో పడి గల్లంతైన రెండున్నర ఏళ్ల బాలిక అనన్య మృతదేహం గురువారం లభించింది. ఇంటి వద్ద ఆడుకుంటుండగా అనన్య డ్రైనేజీలో పడి గల్లంతైంది. మున్సిపల్ సిబ్బంది, పోలీసులు 30 మంది నాలుగు గంటల పైగా డ్రెయినేజీలో బాలిక కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో రాత్రి 9.30 గంటలకు గాలింపు చర్యలను విరమించారు. మరుసటి రోజు ఉదయం మున్సిపల్ సిబ్బంది గాలింపు చ ర్యలు చేపట్టారు. డ్రెయినేజీలో పడిన స్థలం నుంచి సుమారు వంద మీటర్ల దూరంలో పీఎఫ్ ఆఫీసు వెనుకల డ్రెయినేజీలో బాలిక మృతదేహం లభించింది. మున్సిపల్ సిబ్బంది బాలిక తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు.

ఫారెస్ట్ సెక్షన్ అధికారి సస్పెన్షన్

సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని రావుట్ల సెక్షన్ అధికారి వసంత్‌రావును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని ఎఫ్‌ఆర్వో వినయ్‌నాయక్ గురువారం తెలిపారు. బేస్ క్యాంపు ఉద్యోగి నరేందర్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించారని చెప్పారు. జంగిలోడి తండాసమీపంలో అటవీ భూముల ఆక్రమణలో వారి నిర్లక్ష్యంపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న సందేశాత్మక చిత్రాలు

జీజీహెచ్ ఆస్పత్రి గోడపై చిన్నారి టీకా తీసుకుంటున్నట్లు వేసిన చిత్రం





గంగాస్థాన్ ఫేస్-1లో వాటర్ ట్యాంక్‌పై ఆకట్టుకుంటున్న చిత్రం





కంఠేశ్వర్ రోడ్డులో వాటర్ ట్యాంక్‌పై..



జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో నగరపాలక సంస్థ వేయించిన పెయింటింగ్ చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నగరంలోని గంగాస్థాన్ ఫేస్–1లో వాటర్ ట్యాంక్‌పైన, కంఠేశ్వర్ వద్ద వాటర్ ట్యాంక్ పైన చిన్నారుల జలకాలాట చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి బిల్డింగ్‌పైన టీకా తీసుకుంటున్న బాలిక చిత్రం సందేశాత్మకంగా నిలుస్తోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రుణమాఫీ కోసం రణం

- రాజకీయ పార్టీలకు అతీతంగా చేపట్టనున్న ఉద్యమం
- రేపు ఆర్మూర్‌లో సమావేశం కావాలని రైతుల నిర్ణయం
- ఎర్రజొన్నలు, పసుపు రైతుల స్ఫూర్తితో సాగనున్న పోరు
- సమావేశానికి ప్రతి ఇంటి నుంచి భార్య, భర్త హాజరు కావాలని రైతు ప్రతినిధుల వినతి



రుణమాఫీ కోసం శనివారం రోజున సమావేశం అయ్యే అంశంకు సంబంధించిన పోస్టర్

మోర్తాడ్(బాల్కొండ): పంట రుణమాఫీ పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. గతంలో ఎర్రజొన్నలు, పసుపు పంటలకు ధరల సాధన కోసం ఆర్మూర్ వేదికగా సాగించిన పోరాట స్ఫూర్తిని రుణమాఫీ సాధనలోనూ చూపించాలని రైతులు ఉద్యమబాట పట్టారు. రాజకీయాలకు అతీతంగా రుణం మాఫీ కోసం రణం చేపట్టారు. ఈనెల 24న ఆర్మూర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో రైతులు పార్టీలకు అతీతంగా సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించనున్నారు. రుణమాఫీ సాధన సమావేశానికి ప్రతి రైతు కుటుంబం నుంచి భార్య, భర్త కలిసి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల రుణం మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై తిరుగుబాటు జెండా ఎగురవేయనున్నారు. రైతు సంఘాల వారీగా ఉద్యమ నాయకులు తిరుగుతూ సమావేశాన్ని విజయవంతం చేయడానికి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకంగా ముద్రించిన పోస్టర్లను రైతు సంఘాల వద్ద ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో కొద్ది మంది రైతులకు మూడు విడతల్లో రుణం మాఫీ అయ్యింది. అనేక మందికి రేషన్ కార్డులలో పేరు లేకపోవడం, రుణం బకాయి ఎక్కువగా ఉండటం, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పేర్లు వేరు వేరుగా లేదా అక్షర దోషాలు ఉండటంతో రుణమాఫీకి అర్హత సాధించలేరు. రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రుణం మాఫీ జరగకపోతే తాము నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో రైతు ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహించాలని నిర్ణయించడం ఎలాంటి పరిస్థితికి దారి తీస్తుందో వేచి చూడాల్సి ఉంది.

రైతుల కోసమే పోరాటం..



రైతులకు రుణమాఫీతో పాటు రైతు భరోసా సొమ్ము విడుదల చేయాలనే డిమాండ్‌తో ఉద్యమం చేపట్టాం. శనివారం నాటి సమావేశానికి రైతులు స్వచ్ఛందంగా ఆర్మూర్‌కు తరలిరావాలి. ప్రభుత్వంపై ఇప్పుడు ఒత్తిడి తీసుకురాకపోతే రైతులకు రుణమాఫీ సొమ్ము జమ కాదు. అందువల్ల రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలి.

– గోపిడి సత్యనారాయణ, రైతు నాయకుడు, మోర్తాడ్

సామాజిక వివాదాల పరిష్కారానికి కృషి

- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే
- కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణను వర్చువల్‌గా ప్రారంభించిన న్యాయమూర్తి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీతా కుంచాల



వర్చువల్‌గా మాట్లాడుతున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

ఖలీల్‌వాడి: సామాజిక వివాదాల సత్వర పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేటర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. గురువారం జిల్లా కోర్టులోని డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయం సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలలో కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ శిబిరం నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తొలిసారిగా 2021లో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో రాష్ట్రంలో తొలిసారిగా ఉమ్మడి జిల్లాలో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను పైలట్ ప్రాజెక్ట్ కింద అందుబాటులోకి తీసుకువచ్చారు. వివిధ సామాజిక వర్గాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ప్రారంభించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24 వరకు శిక్షణ తరగతులు వర్చువల్ విధానంలో కొనసాగనున్నాయి. ఈ శిక్షణను హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే వర్చువల్‌గా ప్రారంభించగా, హైకోర్టు న్యాయమూర్తులు సుజోయ్ పాల్, కె సురేందర్, జె శ్రీనివాస్‌రావు భాగస్వాములయ్యారు. జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ సామాజిక వివాదాలు, కుటుంబ తగాదాలు వంటి వాటిని కమ్యూనిటీ మీడియేటర్లు (వలంటీర్లు) మధ్యవర్తిత్వం ద్వారా ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. దీంతో కక్షిదారులు అనవసర ఖర్చు తోపాటు, సమయం వృథా కాకుండా అరికట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనేందుకు కూడా ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన వలంటీర్లు తమ ప్రాంతాల్లో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని, పరస్పర ఆమోదయోగ్యమైన రీతిలో వివాదాల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. శిక్షణ శిబిరం ఉద్దేశించి లీగల్ సెల్ రాష్ట్ర అథారిటీ మెంబర్ సెక్రెటరీ, జడ్జి పంచాక్షరీ, జిల్లా జడ్జి సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ రిసోర్స్ పర్సన్, రిటైర్డ్ సెషన్స్ జడ్జి మొహమ్మద్ షమీమ్, కామారెడ్డి సెషన్స్ జడ్జి వీఆర్‌ఆర్ వరప్రసాద్, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ధర్నాలు



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్కొండ, వేల్పూర్‌లలో చేపట్టిన కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. షరతులు లేకుండా అందరికీ రుణమాఫీ ఇవ్వాలన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, ఆర్మూర్‌లో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, డిచ్‌పల్లిలో ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ ధర్నాల్లో పాల్గొన్నారు. బోధన్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేశారు.

- లోపలి పేజీల్లో..

బోధన్ సబ్ కలెక్టర్‌గా వికాస్ మహతో



బోధన్ : బోధన్ రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి వికాస్ మహతోను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ క్యాడర్ 2022 బ్యాచ్‌కు చెందిన వికాస్ మహతో సబ్ కలెక్టర్‌గా బోధన్‌కు రానున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1959లో బోధన్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యింది. అప్పటి నుంచి చాలా మంది ఐఏఎస్ అధికారులు సబ్ కలెక్టర్‌గా పనిచేసి రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయి అధికారులుగా ఎదిగారు. 2012లో ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా, 2013 సెప్టెంబర్ 5 నుంచి 2014 జూన్ 17 వరకు హరి నారాయణ, 2016 డిసెంబర్ 2 నుంచి 2018 జనవరి 4 వరకు సిక్తాపట్నాయక్, 2018 జనవరి 4 నుంచి సెప్టెంబర్ 5 వరకు అనురాగ్ జయంతి బోధన్ సబ్ కలెక్టర్లుగా విధులు నిర్వర్తించారు. 2018 నుంచి ఆర్డీవోల పాలన సాగుతోంది. తాజాగా ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా రానున్నారు. అలాగే బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా కిరణ్మయి నియమితులయ్యారు.

అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్/బోధన్ రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్‌లోని ఏఎంసీ కార్యాలయంలో నూతన పాలకవర్గం పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో జిల్లా సీనియర్ మార్కెట్ అసిస్టెంట్ గజానంద్ బోధన్ ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్య దామోదర్, వైస్ చైర్మన్ చిల శంకర్, పాలకవర్గసభ్యులతో ప్రమాణాస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కొన్ని కారణాలతో కొంతమంది రైతులకు ఇంకా మాఫీ రాలేదని వాటిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని చెప్పారు. రుణమాఫీ రాని రైతులు ఆందోళన చెందవద్దని, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా కుటుంబానికి రూ.రెండు రూ.రెండు లక్షల మాఫీ అందిస్తామని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు సార్లు కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఇంకా రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో బీఆర్‌ఎస్, బీజేపీలు రైతులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చిల శంకర్, సెక్రెటరీ రామ్‌నాథ్ రావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, గిడుగు గంగాధర్, నాగేశ్వర్ రావు, పాషా మోహినోద్దీన్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ పాలకవర్గం


బోధన్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అంకు సంధ్య బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా చిల శంకర్, పాలకవర్గ సభ్యులుగా కర్నె గంగారాం, కె వెంకటేశ్వరరావు, నడిపోళ్ల వసంత్‌రెడ్డి, రమావత్ రవిదాస్, ఎస్ భూమయ్య, శ్రీనివాస్, చేపూరి గంగకిశోర్, నీరడి సాయన్న, బొర్రల్ల శ్రీనివాస్, సలీం బేగ్, ఆవుల బాలకృష్ణారెడ్డి, చీకోటి అంజయ్య, కరిటూరి సత్యనారాయణ, తూము పద్మాశరత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.




ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపడుతున్న సంధ్యదామోదర్, చిత్రంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చేప పిల్లల ఉత్పత్తి ఉత్తిదే!

- నాణ్యమైన గుడ్లు రాక ప్రక్రియ విఫలం
- ఆలస్యం కావడంతో సమస్య



చేప గుడ్లను సేకరిస్తున్న ఫీల్డ్‌మన్



తల్లి చేపల నుంచి వచ్చిన నాణ్యత లేని గుడ్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల జాతీయ చేప పిల్లల కేంద్రంలో ఈ ఏడాది ఉత్పత్తి అయ్యేలా కనిపించడం లేదు. కేంద్రంలో ఉత్పత్తి ప్రక్రియను ఈ నెల 18 నుంచి ప్రారంభించారు. కానీ తల్లి చేపల నుంచి ప్రస్తుతం నాణ్యమైన గుడ్లు రాక పోవడంతో ఉత్పత్తి ప్రక్రియ విఫలం అవుతోంది. రెండు సార్లు ప్రయోగం చేసిన సిబ్బంది ఫలితం లేదని ఉత్పత్తి ప్రక్రియను నిలిపి వేశారు. సాధారణంగా చేప పిల్లల ఉత్పత్తి జూలై, ఆగస్టు నెలల్లో చేపడుతారు. సహజ సిద్ధంగా చేపలు కూడా ఈ నెలల్లోనే ఉత్పత్తి చేసుకుంటాయి. ఈ రెండు నెలల్లో మొదటి 45 రోజులే కీలకమని మత్స్యకారులు అంటున్నారు. కానీ కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి 50 రోజులు గడిచిన తర్వాత ప్రారంభించారు. దీంతో నాణ్యమైన గుడ్లు రావడం లేదు. ఐదు కోట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న కేంద్రంలో ఇప్పటి వరకు ఒక్క చేప పిల్లను కూడా ఉత్పత్తి చేయలేకపోయారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన పిల్లలను మత్స్యసహకార సంఘాల ద్వారా ఉచితంగా చెరువులకు పంపిణీ చేస్తారు. కానీ ప్రస్తుత సంవత్సరం పంపిణీ చేసే అవకాశం లేదు.

నీళ్లు లేక.. నిధులు రాకా

ప్రాజెక్ట్‌లోకి సకాలంలో వరదలు రాకపోవడంతో మొదట్లో నీటి కొరతతో చేపపిల్లల ఉత్పత్తి ప్రారంభించలేదు. ఆగస్టు మొదటి నుంచి ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఉన్నా.. నిధులు రాకా ఆలస్యమైంది. చేప పిల్లల ఉత్పత్తి నిర్వహణ కోసం ప్రస్తుత సంవత్సరం రూ.4.5 లక్షల నిధులు అవసరమని మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ మీనమేషాలు లెక్కించిన అధికారులు చివరికి రూ.లక్ష అందించారు. ఆ డబ్బులతో సామగ్రి తెప్పించేలోగా అనువు దాటిపోతోంది.

కాంట్రాక్టర్ల కోసమేనా?

జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులకు సరిపడా చేప పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం జాతీయ చేప పిల్లల కేంద్రానికి ఉంది. అయితే కాంట్రాక్టర్ల కోసమే ఈ కేంద్రంపై నిర్లక్ష్యం చేస్తున్నారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని చెరువులకు, ప్రాజెక్టులకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారు. సరఫరా బాధ్యతను టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌లకు అప్పగిస్తున్నారు. ప్రాజెక్ట్ దిగువన గల కేంద్రంలో ఒక్క చేప పిల్లను ఉత్పత్తి చేయడానికి రూ.1.50 పైసల ఖర్చు అవుతుంది. అదే టెండర్ ద్వారా రూ.4.50 పైసలకు కొనుగోలు చేస్తున్నారు. కమీషన్ల కోసమే ఈ కేంద్రంపై నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కేంద్రంలో ఉత్పత్తి ప్రక్రియ ఆలస్యంగా చేపట్టడంపై విచారణ చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నాణ్యమైన గుడ్లు రావడం లేదు

చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ చేపట్టే చివరి గడువు కావడంతో తల్లి చేపల నుంచి నాణ్యమైన గుడ్లురావడం లేదు. దీంతో పిల్లల రావడం లేదు. ప్రస్తుత సంవత్సరం ఉత్పత్తి జరిగే అవకాశం లేదు.

– రాజేందర్, ఏఎఫ్‌డీవో, పోచంపాడ్

క్లుప్తంగా

నిలకడగా ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోకు సమానంగా కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. ఎగువ నుంచి 4,572 క్యూసెక్కుల వరద వస్తుండగా, కాకతీయ కాలువ ద్వారా 3,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 541 పోతుండగా, మిషన్ భగీరథ తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా, గురువారం సాయంత్రానికి 1082.10 (51.02 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నేడు జీజీహెచ్ డైట్ టెండర్ల ఓపెన్

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్ డైట్ టెండర్లను ఓపెన్ చేయని వైనంపై 'తాత్సారమెందుకో?' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితం కావడంతో అదనపు కలెక్టర్ అంకిత్ స్పందించారు. టెండర్ ప్రక్రియలో ఆలస్యంపై ఆరా తీసిన ఆయన, శుక్రవారం రోజున టెండర్లను ఓపెన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాయలం నుంచి టెండర్లు దాఖలు చేసిన వారి సమాచారం అందించారు. ఉదయం 11గంటలకు అదనపు కలెక్టర్ చాంబర్‌లో టెండర్లను ఓపెన్ చేయనున్నారు. నిష్పక్షపాతంగా టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

రైతు జేఏసీ ఆందోళనకు బీజేపీ మద్దతు

సుభాష్‌నగర్: అర్హులైన రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని 24న రైతు ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళనకు బీజేపీ పూర్తి మద్దతును ప్రకటించింది. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు. జిల్లాలో దాదాపు 2.75లక్షల మంది రైతులు ఉండగా, కేవలం 85,084 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని పేర్కొన్నారు. సుమారు 1,89,916 మందికి రుణమాఫీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వివిధ కారణాలను చూపుతూ అర్హులైన రైతులకు రుణమాఫీ కాకుండా ప్రభుత్వం అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రుణమాఫీ అయ్యే వరకు రైతుల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

పోడు పేరుతో గొడ్డలి వేటు

- అడవుల్లో యథేచ్ఛగా చెట్ల నరికివేత
- ముడుపులకు ఆశపడి అటువైపు చూడని అధికారులు



పందిమడుగు సెక్షన్‌లో అడవికి సమీపంలో భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)



సిరికొండ అటవీ ప్రాంతంలో నరికివేతకు గురైన టేకు చెట్లు

సిరికొండ: మండలం పరిధిలోని అడవిలో చెట్ల నరికివేత జోరుగాసాగుతోంది. పోడు పేరిట చెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. అడవుల్లో నరికివేతకు గురైన చెట్లను రెండు రోజుల క్రితం నరికినట్లు తెలుస్తోంది. కొట్టేసిన చెట్ల ఆకులు ఇంకా వాడిపోకుండా పచ్చగానే కనిపిస్తున్నాయి. అడవుల ఆక్రమణ నిరాటంకంగా కొనసాగుతున్నా అటవీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ఒకప్పుడు కాకులు దూరని కారడవిలా ఉన్న అడవులు క్రమేణా పలుచబడుతున్నాయి. అడవులను అడ్డగోలుగా నరికివేస్తుండటంతో వన్యప్రాణులు గ్రామాల వైపు వస్తున్నాయి. సిరికొండ అటవీ శాఖ రేంజ్ పరిధిలో సిరికొండ, పందిమడుగు, తూంపల్లి, రావుట్ల సెక్షన్‌లు ఉండగా, 20 వరకు బీట్లు ఉన్నాయి. అన్ని సెక్షన్ల పరిధిలో గతంలో వేలాది ఎకరాల్లో అడవులు విస్తరించి ఉండేవి. పోడు పేరుతో అడవులను ఇష్టారీతిన నరికివేస్తుండటంతో అడవులు అంతరించిపోతున్నాయి.

రెండు రోజుల క్రితం నరికిన ఆనవాళ్లు

సిరికొండ సెక్షన్ పరిధిలో చీమన్‌పల్లి వైపు వెళ్లే మార్గంలో అటవీ ప్రాంతాన్ని 'సాక్షి' రెండ్రోజుల క్రితం పరిశీలించేందుకు వెళ్లింది. సిరికొండ-వేములవాడ ప్రధాన రహదారి నుంచి కిలోమీటర్ లోపలికి వెళ్లి చూడగా అడవిలో టేకు చెట్లను యథేచ్ఛగా నరికి వేశారు. సుమారు 60 నుంచి 70 ఎకరాల విస్తీర్ణంలో చెట్లను నరికి వేశారు. ఆధునిక యంత్రాలను వినియోగించి చెట్లను నరికిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ తతంగం అటవీ శాఖ సిబ్బందికి తెలిసే జరుగుతుందనేందుకు కూడా అక్కడ ఆనవాళ్లు ఉన్నాయి. ఆ ప్రాంతంలో గతంలో నరికేసిన టేకు చెట్లకు అటవీ శాఖ అధికారులు ఎరుపు రంగుతో నంబర్లు వేశారు. నరికిన చెట్లను గుర్తించినప్పటికీ టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు ఇంకా అక్కడి నుంచి తరలించలేదు. వాటికి తోడు రెండు మూడు రోజుల క్రితం టేకు చెట్లను కటింగ్ యంత్రాలతో నరికిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. చెట్ల ఆకులు వాడిపోకుండా ఇంకా పచ్చగానే దర్శనమిస్తున్నాయి. చెట్ల నరికివేత జోరుగా కొనసాగుతున్నా అటవీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీ శాఖ అధికారులైన బీట్ అధికారి నుంచి రేంజర్ వరకు ముడుపులు ముడుతున్నాయని మండలవాసులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అడవుల నరికివేత తూంపల్లి, పాకాల, పందిమడుగు, చీమన్‌పల్లి, రావుట్ల, న్యావనంది అటవీ ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతోందని తెలిసింది. ఇప్పుడు కబ్జా చేస్తే మున్ముందు పోడు పట్టాలు వస్తాయనే ధీమాతో అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నారు. అడవుల నరికివేతకు సహకరించడానికి అటవీ శాఖ సిబ్బందికి ఎకరానికి యాభై వేల వరకు ముడుపులు ముట్టజెపుతున్నట్లు ఆరోపణలున్నాయి. పోడు భూముల్లో బోర్లు వేసుకోవాలంటే ఒక్కో బోరుకు 20 వేల వరకు అటవీ శాఖ అధికారులకు ముట్టచెప్పాల్సిందేనని తెలిసింది. మూడు రోజుల క్రితం జంగిలోడి తండా వద్ద అటవీ భూముల స్వాధీనం సమయంలో పంటల సాగు కోసం అటవీ శాఖ అధికారులకు ఐదు లక్షలు ఇచ్చామని గిరిజనులు ఆరోపించారు. దీన్ని బట్టే తెలుస్తోంది ఆ శాఖ అధికారులు ఎన్ని లక్షలు వసూలు చేశారనేది. అడవుల రక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నప్పటికీ.. కంచే చేను మేసిన చందంగా ఉంది అటవీ శాఖ అధికారులు తీరు.

చర్యలు తీసుకుంటాం

సిరికొండ అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వారిని మహిపాల్ తండా వాసులుగా గుర్తించాం. ఎంత నష్టం చేశారనే దానిపై విచారణ చేస్తున్నాం. చెట్లను నరికిన వారిపై పీడీ యాక్ట్ ద్వారా కేసులు నమోదు చేసేందుకు డీఎఫ్‌వోకు నివేదించాం. లొంకతండా వాసులపై కూడా కేసులు నమోదు చేశాం.

– ఎంవీ నాయక్, సిరికొండ అటవీ శాఖ రేంజ్ అధికారి

ఇన్‌చార్జి అధికారులే దిక్కు!

- పౌరసరఫరాలశాఖలో కొరవడిన పర్యవేక్షణ
- మూడు నెలలుగా ఇన్‌చార్జీతో నెట్టుకొస్తున్న వైనం
- ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానం..

సుభాష్‌నగర్: జిల్లా పౌరసరఫరాశాఖలో పర్యవేక్షణ కొరవడింది. గత మూడు నెలలుగా ఇన్‌చార్జి అధికారి బాధ్యతల్లో ఉండటంతో రైస్‌మిల్లర్లు, రేషన్‌డీలర్లు, కార్యాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రైస్‌మిల్లుల్లో తనిఖీల సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిస్థాయి డీఎస్‌వో లేకపోవడంతో జిల్లాలో అధికారులు ఇష్టారీతిన వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి. డీఎస్‌వో చంద్రప్రకాశ్ సస్పెన్షన్ తర్వాత ఇన్‌చార్జి డీఎస్‌వోగా సి పద్మకు బాధ్యతలు అప్పగించారు. ఆమె వారంలో రెండు, మూడు రోజులు కూడా జిల్లాలో అందుబాటులో ఉండటంలేదు. శాఖ పర్యవేక్షణను పూర్తిగా గాలికొదిలేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ మళ్లీ మంచిర్యాల ఏసీఎస్‌వోకు ఇన్‌చార్జి డీఎస్‌వోగా బాధ్యతలు అప్పగించారు.

జిల్లాకు ప్రత్యేక స్థానం

రాష్ట్ర పౌరసరఫరాశాఖలో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ధాన్యం సేకరణ, సీఎంఆర్ కేటాయింపులు అధికంగా ఉంటాయి. ధాన్యం సేకరణలో జిల్లా రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంటుంది. రెండు సీజన్లకుగాను 10లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం సేకరించి, మిల్లులకు కేటాయింపులు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 320కి పైగా రా, బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. అంతేగాకుండా 751 రేషన్ దుకాణాలు, 230 వరకు పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు కొనసాగుతున్నాయి. వీటి పర్యవేక్షణకు పూర్తిస్థాయి అధికారిని నియమించాల్సి ఉన్నా.. కమిషనరేట్ కార్యాలయం మాత్రం ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తోందని, ఇందులో ఆంతర్యమేమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

మూడునెలలుగా ఇష్టారాజ్యం

హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తున్న పద్మ ఇన్‌చార్జి డీఎస్‌వోగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జిల్లాలోని పౌరసరఫరాశాఖలో పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది, రేషన్‌డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దుకాణాలు సమయపాలన పాటించకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు. రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్, మిల్లుల్లో ధాన్యం, సీఎంఆర్ తనిఖీలు, రేషన్‌షాపులు, హాస్టళ్లు, అంగన్‌వాడీలకు బియ్యం కేటాయింపులు తదితర బాధ్యతలు నిర్వర్తించే అధికారి అందుబాటులో లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా రైస్‌మిల్లుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు తనిఖీలను ఇష్టారీతిన చేపడుతున్నారు. డీఎస్‌వో కార్యాలయంలోనూ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గాడిలో పడేనా..?

జిల్లా పౌరసరఫరాశాఖలో మూడు నెలల్లో పాలన అంతా అస్తవ్యస్తంగా తయారైంది. పరిస్థితిని గాడిలో పెట్టేందుకు పూర్తిస్థాయి డీఎస్‌వో వస్తారని అందరూ ఎదురుచూశారు. కానీ ఇటీవల జరిగిన బదిలీల్లో మంచిర్యాల జిల్లా ఏసీఎస్‌వో అరవింద్ రెడ్డిని జిల్లాకు ఇన్‌చార్జి డీఎస్‌వో (ఎఫ్ఏసీ)గా బదిలీ చేశారు. అంతేగాకుండా జిల్లాలో పూర్తిస్థాయి ఏసీఎస్‌వో కూడా లేరు. అరవింద్‌రెడ్డి శుక్రవారం డీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది. మూడు నెలల కాలంలో జరిగిన అస్తవ్యస్త పాలనను గాడిలో పెడతారా? లేదా? అనేది వేచి చూడాలి.

హెల్మెట్ వినియోగంపై విస్తృత ప్రచారం

మోర్తాడ్(బాల్కొండ): ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలనే ఆంక్షల నేపథ్యంలో పోలీసులు, ఆర్టీఏ అధికారులు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే మొదటి తప్పుగా భావించి రూ.వెయ్యి జరిమానా విధించనుండగా, తరువాత అదే తప్పు రిపీట్ అయితే కఠిన శిక్షను అమలు చేసే అవకాశం ఉంది. వాహనాలను నడిపేవారు ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నిబంధనలను పాటించేలా అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనాదారులను రోడ్లపైనే నిలిపి హెల్మెట్ వినియోగం ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు.



ఏర్గట్లలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కమిషనరేట్ పరిధిలోని ప్రతి స్టేషన్ పరిధిలో పోలీసులు విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహన వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

బోధన్‌రూరల్: సాలూర, బోధన్ మండలాల్లోని గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్సై జక్కుల మచ్చేందర్ హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సాలూర మండలంలోని హున్సాలో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన వారి నుంచి రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా పేకాటస్థావరాలు కొనసాగితే తమకు సమాచారం అందించాలని కోరారు.

గీత కార్మికులపై అసత్య ప్రచారాన్ని మానుకోవాలి

నిజామాబాద్ రూరల్: కల్లు గీత కార్మికులపై అసత్య ప్రచారాన్ని మానుకోవాలని మూడో కల్లు డిపో యాజమాన్యం పేర్కొంది. మారుతినగర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిపో సభ్యులు మాట్లాడారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉన్న మూడో డిపోలో 18 నెలలకు ఒకసారి సంఘం మహాజన సభ నిర్వహిస్తామని, అలాగే అందులో పనిచేస్తున్న సభ్యులకు వేతనాలు పెంచుతామన్నారు. మూడో డిపో పరిధిలో ఉన్న సంఘంలో 65 ట్యాపర్లు, 9 మంది డైరెక్టర్లు, 400 మంది కుల సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, చనిపోయిన ప్రతి గీత కార్మికుడి కుటుంబానికి డిపో నుంచి రూ.20వేలు అందజేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా బీసీ యువజన సంఘం ముఖ్యనాయకుడు ఒకరు మూడో డిపో గౌడ సంఘం కార్మికులపై అసత్య ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమ సొసైటీని భూస్థాపితం చేస్తానని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో గీత కార్మిక సంఘంలో చిచ్చుపెట్టి గొడవలకు కారణమవుతున్నాడని, ఇలాంటి చర్యలను మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో గీత కార్మికులు, డైరెక్టర్లు, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మూడో డిపో సంఘ సభ్యులు

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

నిజామాబాద్‌రూరల్: ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని ట్రెయినీ కలెక్టర్ సంకేత్ అన్నారు. గూపన్‌పల్లిలోని సేంద్రియ రైతు చిన్నికృష్ణుడు వ్యవసాయ క్షేత్రాన్ని ట్రెయినీ కలెక్టర్ గురువారం సందర్శించారు. చిన్నికృష్ణుడు సాగు చేస్తున్న వరివంగడాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం నల్లకొండెం సన్నరకం సాగుచేస్తున్నట్లు ఆయన ట్రెయినీ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణుడిని ట్రెయినీ కలెక్టర్ అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



నవీపేట: మండలంలోని హనుమాన్ ఫారం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లా బాసర మండలం కిర్గుల్‌కు చెందిన సగ్గు సాయన్న(74) మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. మాక్లూర్ మండలం గుంజ్లిలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి సగ్గు సాయన్న తన కొడుకు సుభాష్‌తో కలిసి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా హనుమాన్ ఫారం సమీపంలో వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సగ్గు సాయన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన పిట్ల గోపాల్ (38) 2019 మే 22 న గజ్వేల్ నియోజకవర్గంలోని నాచారం సమీపంలో హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో అతడిని సంపంగి రవి అనే వ్యక్తి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. రవిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చగా, నేరం రుజువుకావడంతో జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. సాక్ష్యాధారాలను ప్రవేశ పెట్టిన సీఐలు రామాంజనేయులు, సంతోష్‌కుమార్, వెంకట్, ఎస్సైలు అంజయ్య, వెంకటేశ్వర్లు, వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్, సిబ్బంది శ్రీనివాస్, సతీశ్ గౌడ్, మురళిని ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట: మండలంలోని నారాయణ్‌పూర్‌లో బుధవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారని ఎస్సై వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. నింపు సరళత అనే మహిళతోపాటు ఆమె కుటుంబ సభ్యులు కింది పోర్షన్‌లో భోజనం చేసిన అనంతరం తాళం వేసి పై పోర్షన్‌కు వెళ్లి నిద్రించారు. గురువారం ఉదయం కింది పోర్షన్ తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. దుండగులు 19 గ్రాముల బంగారు ఆభరణాలు, 120 గ్రాముల వెండి ఆభరణాలతోపాటు రూ. 1,30,000 నగదును ఎత్తుకెళ్లారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోర్టు ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ గురువారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15 మందికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో హాజరుపరిచారు. 12 మందికి మొత్తం రూ.31,500 జరిమానా విధించిన మెజిస్ట్రేట్ ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం



భీమ్‌గల్: మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన పొట్టోడి సోను అను మహిళా 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గురువారం సోనుకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ లోను భీమ్‌గల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా పురుటి నొప్పులు ఎక్కువయ్యాయి. 108 సిబ్బంది అయిన ఈఎంటీ సురేందర్, పైలట్ రాంకుమార్ మహిళకు ప్రసవం చేసి తల్లీబిడ్డను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోను కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ లక్కీ డ్రా

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికుల్లో నుంచి లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసినట్లు నిజామాబాద్-1 అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు వరంగల్ రూట్‌లో ప్రయాణించిన వారికి సంబంధించిన లక్కీడ్రాను గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. మొదటి బహుమతి వరలక్ష్మి (జగిత్యాల), రెండో బహుమతి సరస్వతి (నవీపేట్ మండలం మద్దేపల్లి), తృతీయ బహుమతి రాణి (జగిత్యాల జిల్లా రాయికల్)కి దక్కింది. కార్యక్రమంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సిబ్బంది లక్ష్మణ్‌రావు, గోవర్ధన్, స్టేషన్ మేనేజర్, ఉద్యోగులు పాల్గొన్నారు.



బంగారు 'కిళ్లీ'



ఖలీల్ వాడి: బంగారు కిళ్లీ అంటే బంగారంతో చేసింది కాదు. ఈయన వేసే పాన్ బంగారంలా ఉంటుంది.. అలాగే అతని ఒంటిపై రెండున్నర కిలోల బంగారంతో ధగధగలాడి పోతాడు. తెలంగాణలో హుస్సేన్ పాన్‌కు ప్రత్యేకత ఉంది. ఒక్కో స్టైల్‌లో ఒక్కోపాన్‌ను తయారు చేయడం ఇతడి ప్రత్యేకత. బుధవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో హుస్సేన్ సందడి చేశారు. హుస్సేన్‌తో సెల్ఫీల కోసం ఫంక్షన్‌కు హాజరైన వారు ఎగబడ్డారు. దివ్యాంగుడైన హుస్సేన్ వైకల్యం దేనికీ అడ్డుకాదని నిరూపిస్తున్నాడు. ఫంక్షన్‌లలో పాన్ కట్టేందుకు గంటకు రూ.3 వేలు చార్జి చేస్తున్నాడు. తెలంగాణలోనే మొట్టమొదటిసారి ఫైర్ పాన్‌ను తీసుకువచ్చింది హుస్సేనే.

రిజర్వ్ ఫారెస్ట్‌లో అడవి పిల్లి మృతి

- చిరుత పులి మృతి అని ప్రచారం..
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

కమ్మర్‌పల్లి: మెట్‌పల్లి రోడ్‌లోని రిజర్వ్ ఫారెస్ట్‌లో గురువారం అడవి పిల్లి(జంగ పిల్లి) కళేబరం లభ్యమైంది. పశు కాపరులకు కళేబరం కనిపించడంతో చిరుత పులిది అనుకుని అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన అధికారులు ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. ఆ కళేబరం చిరుత పులిది కాదని, జంగిల్ క్యాట్(అడవి పిల్లి)గా నిర్ధారించారు. కళేబరానికి పురుగుల పట్టాయని, అడవి పిల్లి వారం రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. అడవి పిల్లి చర్మం చిరుత పులిని చర్మాన్ని పోలి ఉండడంతో.. అడవి చిరుత పులి మృతి చెందిందని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మృతి చెందింది చిరుత పులి కాదని, అడవి పిల్లి అని ఎఫ్ఆర్‌వో రవీందర్ తెలిపారు.



అడవిపిల్లి కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విష్ణువర్ధన్ తెయూకి గర్వకారణం



తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలోని అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ కోర్సు 2022లో పూర్తిచేసిన విద్యార్థి మామిడి విష్ణువర్ధన్‌కు సౌత్ కొరియా గ్రీన్ ప్లెయిన్ ఇండస్ట్రీ రూ.21 లక్షల వార్షిక వేతనంతో శాస్త్రవేత్తగా ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు అందజేయడంతో అతడిని రిజిస్ట్రార్ ఎం యాదగిరి గురువారం అభినందించారు. ఈ మధ్య కాలంలో తెవివిలో ఇంత భారీ మొత్తం వేతనంతో నియామకమైన విష్ణువర్ధన్ చరిత్ర సృష్టించాడని, ఇది విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. విష్ణువర్ధన్ ఐఐటీసీ హైదరాబాద్‌లో తెయూ ఫార్మాస్టికల్ కెమిస్ట్రీ విభాగం ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ అనే అంశంపై లోతైన పరిశోధనతో గుర్తింపు తెచ్చుకున్నాడని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

కొడుకు మరణాన్ని తట్టుకోలేక తండ్రికి గుండెపోటు

- వారం రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- బోధన్ మండలం బెల్లాల్‌లో విషాదం



సాయికుమార్ (ఫైల్)



దేవర్ల వెంకటేశ్ (ఫైల్)

బోధన్‌రూరల్: కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి గుండెపోటుతో మృతి చెందిన విషాదకర ఘటన బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దేవర్ల వెంకటేశ్, శశికళ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. వారి చిన్న కొడుకు దేవర్ల సాయికుమార్ (22) ఈ నెల 18న రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమంలో మొక్కు చెల్లించుకోవడానికి స్నేహితుడితో కలిసి వెళ్లాడు. గోదావరి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి సాయికుమార్ మృతి చెందాడు. కొడుకు మృతి చెందిన నాటి నుంచి దిగాలుగా ఉంటున్న తండ్రి వెంకటేశ్‌కు బుధవారం అర్ధరాత్రి గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా గురువారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతి చెందాడు. గురువారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. వారం రోజుల వ్యవధిలో తండ్రీకొడుకులు మృతి చెందడడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

తల్లిని చంపిన వ్యక్తిపై హత్యాయత్నం..

కామారెడ్డి క్రైం: తన తల్లిని చంపిన వ్యక్తిపై పగ పెంచుకున్న కొడుకు సదరు వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కామారెడ్డిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మాచారెడ్డి మండలం లక్ష్మీరావుల పల్లి గ్రామానికి చెందిన పల్లెపు నర్సింలు 2021లో జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన కాకర్ల బాలమణిని హత్య చేశాడు. దీంతో మృతురాలు బాలమణి కొడుకు వికాస్ నర్సింలుపై కక్ష పెంచుకున్నాడు. కామారెడ్డి పాత బస్టాండ్ వద్ద గురువారం కనిపించిన నర్సింలును బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని ఆర్‌బీ నగర్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ చేతులు కట్టేసి కర్రలు, రాళ్లతో దాడి చేశాడు. స్థానికులు గమనించి నర్సింలును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సింలు